మామిడికాయలకు వెళ్లి..

విద్యుదాఘాతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

చేతన్‌రెడ్డి(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 17 : మామిడికాయల కోసం తోటలోకి వెళ్లి విద్యుదాఘాతానికి గురై సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన గురువారం శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ఆనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన కె. చేతన్‌రెడ్డి(27) నగరంలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆరు నెలల కిందట వివాహం చేసుకొని తాళ్లగడ్డ ప్రాంతంలో నివాసముంటున్నారు. అయితే చేతన్‌రెడ్డి తన భార్యను పోటీ పరీక్ష రాయించేందుకు గురువారం మొయినాబాద్ మండలం భాస్కర ఇంజినీరింగ్ కళాశాలకు తీసుకెళ్లాడు. పరీక్ష ముగిసిన తర్వాత రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం భార్య స్వగ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామ శివారులో గోనేల యాదయ్య ముదిరాజ్‌కు చెందిన పొలంలో మామిడిచెట్లు కనిపించాయి. దీంతో వారిద్దరూ వెళ్లి మామిడికాయలు కావాలని అక్కడ ఉన్న వారిని అడిగి లోపలికి వెళ్లి కాయలు తెంపుకొని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ప్రహరీ లోపల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి చేతన్‌రెడ్డి షాక్‌కు గురై కిందపడిపోయాడు. దీంతో అతడి భార్య చూసి పెద్దగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న కొందరు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే సదరు వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. తాను పలుమార్లు సీపీఆర్ చేసినప్పటికీ కదలడం లేదని చేతన్‌రెడ్డి భార్య పేర్కొన్నారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ బేస్‌బాల్ సంఘం కోశాధికారిగా శ్వేత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత అమెచ్యూర్ బేస్‌బాల్ ఫెడరేషన్ కొత్త కార్యవర్గం కొలువుదీరింది. గురువారం భువనేశ్వర్‌లో జరిగిన ప్రత్యేక వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పంకజ్ లోచన్ మోహంతి, ప్రధాన కార్యదర్శిగా మిథాలీ ఘోష్, కోశాధికారిగా తెలంగాణకు చెందిన శ్వేత నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా శిబానంద్ ప్రధాన్, అశోక్‌కుమార్, మధుశర్మ, రాజుశర్మ వ్యవహరించనున్నారు.

బాలికపై అఘాయిత్యం.. నిందితుడికి పదేండ్ల జైలు

బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్17(నమస్తే తెలంగాణ): ఓ బాలికపై ప్రేమ, పెండ్లి పేరుతో అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడు జంగం నరేందర్(20)కు పదేండ్ల జైలుశిక్ష, 30వేల జరిమానా విధిస్తూ బాధితురాలికి రూ.4లక్షల పరిహారం అందించాలని పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. అదనపు పీపీ డి.రఘు కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం పటేల్‌గూడకు చెందిన నిందితుడు భవన నిర్మాణ కార్మికుడు నరేందర్.. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పి పెండ్లి పేరుతో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న ఆదిభట్ల పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

పబ్‌ల మాటున వ్యభిచారం!

- శివార్లలో పెరుగుతున్న పబ్ కల్చర్
- యువతులకు ఫ్రీ ఎంట్రీతో.. బిల్లింగ్ టార్గెట్స్
- పలువురు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ వ్యాపారుల ఆరోపణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): శివారుల్లోనూ పబ్ కల్చర్ పెరుగుతున్నది. తమ వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం వివిధ ప్రాంతాల నుంచి యువతులను పబ్‌లకు రప్పిస్తూ గబ్బు పనులతో యువకుల నుంచి అందినకాడికి కొన్ని పబ్‌ల నిర్వాహకులు దోచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు నగరంలోని ప్రధాన ప్రాంతాలకే పరిమితమైన ఈ కల్చర్ శివారులకు పాకడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలోని హార్ట్స్ పబ్‌పై ఎల్బీనగర్ ఎస్ ఓటీ పోలీసులు దాడి చేశారు. పోలీసులు వెళ్లే సరికి యువతులు అశ్లీల నృత్యాలు చేస్తూ, డీజేలతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దృశ్యాలు కన్పించడంతో 16 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వ్యాపారాన్ని పెంచుకునేందుకు పబ్ నిర్వాహకుడు యువతులకు ఉచితంగా పబ్‌లోకి అనుమతిస్తున్నారని తేలింది.

బిల్లు పెంచేస్తారు..

పబ్‌కు వెళ్లే యువకులకు రూ.2వేలు ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నారు. ఒంటరిగా, స్నేహితులతో పబ్‌కు వెళ్లి యువకులు కేరింతలు కొడుతున్నారు. శివారులలో యువతులు ఎక్కువగా పబ్‌లకు వెళ్లరు. దీంతో ఓ పబ్ నిర్వాహకుడు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు నగరంలోని వివిధ పబ్‌లకు తరుచూ వెళ్లే యువతులను, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన యువతులను తమ పబ్‌లోకి వచ్చేలా ఉచిత ఎంట్రీతో వెసులుబాటు కల్పిస్తున్నాడని పోలీసుల విచారణలో బయటపడింది. అలా వెళ్లిన యువతులు పబ్‌లోకి వచ్చే ఇతర కస్టమర్లతో స్నేహంగా మెలుగుతూ యువకులకు దగ్గరవుతుంటారు. అలా పరిచయం చేసుకుంటూ యువకులతో మద్యం ఎక్కువగా తాగించడం, తమకు మద్యం తెప్పించుకోవడం చేస్తూ బిల్లును పెంచడమే లక్ష్యంగా ఆ యువతుల వ్యవహారం ఉంటుందని పోలీసుల విచారణలో తేలింది. యువకులను బుట్టలో వేసి మద్యం తాగించడంతో పాటు ఖరీదైన మద్యం సేల్స్‌ను పెంచేలా ఆ యువతులు స్కెచ్ వేస్తుంటారని ఆరోపణలున్నాయి. ఎక్కువ గిరాకీ చేసే యువకులతో అక్కడుండే యువతులు కొందరు నృత్యాలు చేస్తుండగా.. మరికొందరు మరో అడుగు ముందుకేసి అశ్లీల నృత్యాలు సైతం చేస్తుంటారని పోలీసులు పేర్కొంటున్నారు. చైతన్యపురిలో పట్టుబడ్డ హార్ట్స్ పబ్ నిర్వాహకుడికి బంజారాహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లోనూ పబ్‌లతో సంబంధాలున్నట్లు విచారణలో తేలింది. ఇలా అక్కడి కల్చర్‌ను శివారుల్లో కూడా నిర్వహించి లాభాలు గడించాలని నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పరోక్షంగా వ్యభిచారం ప్రోత్సహించినట్లే..!

పబ్ నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి వేసిన ఈ ప్లాన్లు పరోక్షంగా వ్యభిచారాన్ని కూడా ప్రోత్సహిస్తున్నట్లుగా ఉందని పోలీసులు భావిస్తున్నారు. మద్యం మత్తులో అశ్లీల ప్రదర్శనలు చేస్తూ బయటకు వెళ్లిన తరువాత వాళ్లు కలుసుకునే అవకాశాలు కూడా లేకపోలేదని పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వీళ్ల వ్యవహారం శాంతి భద్రతలకు కూడా విఘాతం కల్గించే అవకాశాలున్నాయి. యువతుల కోసం యువకులు గొడవలు పడటం, రోడ్లపై అశ్లీలంగా వ్యవహరించడం కూడా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపారం కోసం నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చైతన్యపురిలో వెలుగుచూసిన ఈ ఘటనతో అప్రమత్తమైన రాచకొండ పోలీసులు కమిషనరేట్ పరిధిలో ఉన్న సుమారు 10 పబ్‌లతోపాటు బార్లపై మరింత నిఘాను మరింత పెంచారు.

మాముళ్లు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిలింగ్

ఈ వ్యవహారంపై పబ్ నిర్వాహకుడు మరోలా స్పందిస్తున్నాడు. పబ్‌కు వచ్చే యువతులకు తమకు ఎలాంటి సంబంధంలేదని, తనను కొందరు రాజకీయ నాయకులు, యువ సేనాలు, సంఘాలు, కొందరు రిపోర్టర్లమంటూ వచ్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపిస్తున్నాడు. వారు చేసిన బ్లాక్‌మెయిలింగ్‌కు తలొగ్గక పోవడంతోనే తమపై పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ ఆరోపించాడు. గురువారం సోషల్‌మీడియాలో పబ్ యజమాని అంటూ ఒక వాయిస్ మెసేజ్‌ను పోస్టు చేశారు. అది వైరల్ అయ్యింది. కొందరు తమకు నెలవారీగా మాముళ్లు ఇవ్వాలని, తాము లోకల్ వాళ్లమని డబ్బు ఇవ్వాలని, మరికొందరు రాజకీయ నాయకుల పేర్లు చెబుతూ తమను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. ప్రభుత్వానికి తాము సంవత్సరానికి ఫీజు చెల్లిస్తున్నామన్నారు. బ్లాక్‌మెయిలింగ్‌లకు తలొగ్గకపోవడంతోనే తమపై పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారంటూ వాయిస్లో పేర్కొనడం గమనార్హం.

స్టాక్ ట్రేడింగ్ పేరుతో మోసం.. సైబర్ నేరగాడు అరెస్ట్

నిందితుడు ఆకాశ్ వర్మ

సిటీబ్యూరో, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ): తక్కువ పెట్టుబడికి అతి తక్కువ సమయంలో రెట్టింపు రాబడి వస్తుందంటూ అమాయకుల ఖాతాలు ఖాళీ చేస్తున్న ఓ ఘూరాన సైబర్ నేరగాడిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... యూపీకి చెందిన ఆకాశ్ అలియాస్ ఆకాశ్ వర్మ(22) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. డబ్బుకోసం నిందితుడు వాట్సాప్, టెలీగ్రామ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని, తమ వద్ద పెట్టుబడులు పెడితే, తక్కువ సమయంలో రెట్టింపు రాబడి వస్తుందని నమ్మిస్తారు. అందు కోసం మొదట్లో కొంత రాబడి అందజేసి నమ్మిస్తారు. అది నమ్మిన ప్రజలు ఆశతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతారు. బాధితులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టిన వెంటనే విత్‌డ్రాల్స్‌ను బ్లాక్ చేసి, అందినకాడికి దోచుకుంటారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఓ వ్యక్తికి, నిందితుడు వాట్సాప్ కాల్ చేసి తనను తాను సంజయ్‌గా పరిచయం చేసుకున్నాడు. అంతే కాకుండా మరో వ్యక్తి అబకస్ అమైని కూడా పరిచయం చేశాడు. అనంతరం ఒక అప్లికేషన్ లింక్ పంపించి, డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. ఈ లింగ్ ద్వారా ట్రేడింగ్ చేస్తే తక్కువ సమయంలోనే అధిక రాబడి వస్తుందని నమ్మించాడు. దీంతో బాధితుడు ఆ లింక్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ట్రేడింగ్ మొదలుపెట్టాడు. మొదట్లో కొంత రాబడి ఇచ్చిన అగంతకుడు ఆ తరువాత పెద్ద మొత్తంలో రాబడి కోసం అబకస్‌ను సంప్రదించాలని సూచిస్తూ వాట్సాప్ గ్రూప్-2లో బాధితుడిని యాడ్ చేయించాడు. సంజయ్ మాటలను నమ్మిన బాధితుడు అబకస్‌ను సంప్రదించగా.. తనకు చూపిస్తున్న మొత్తం రాబడిపై 10శాతం డబ్బు జమ చేయాలని సూచించాడు. అది నమ్మిన బాధితుడు పలు మార్లు డబ్బును అగంతకులు సూచించిన ఖాతాలో జమ చేస్తూ రూ.1.47కోట్లు మోసపోయాడు. అప్పుడు విషయాన్ని గ్రహించిన బాధితుడు నగర సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

అమెరికా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి.. రూ.52 లక్షల బురిడీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : అమెరికా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే భారీ మొత్తంలో లాభాలు సంపాదించవచ్చంటూ సైబర్ నేరగాళ్లు మరో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు. అమెరికా స్టాక్ మార్కెట్, ఇండియన్ స్టాక్ మార్కెట్ల ఐపీవోలు తీసుకుంటే అనుకున్న లక్ష్యాలను ఈజీగా సంపాదించవచ్చని, అందుకు తగిన నైపుణ్య శిక్షణ కూడా తామే ఇస్తామంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ట్రేడింగ్‌లో త్వరగా లాభాలు సంపాదించేందుకు తాము క్రియేషన్ ఇన్వెస్ట్మెంట్ ట్రేడింగ్ ప్లాట్ఫారం ఏర్పాటు చేశామని, ఇందులో మీరు సభ్యులుగా చేరితే భారీ లాభాలు సంపాదించవచ్చు అంటూ దమ్మాయిగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి రూ.52 లక్షలు బురిడీ కొట్టించారు. బాధితుడి నంబర్ ను వీఐపీ 8 స్టాక్ మార్కెట్ వెల్త్ సీక్రెట్ అండ్ స్ట్రాటజీ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఇక్కడ మార్కెట్ లో రోజు జరిగే లావాదేవీలకు సంబంధించిన చర్చ జరుగుతుందని, మీరు కొన్ని రోజులు గమనించండి అంటూ బాధితులకు సూచన చేశారు. విశాల్ శర్మానే పేరుతో సైబర్ నేరగాడు బాధితుడికి ఫోన్ చేసి క్రియేషన్ ఇన్వెస్ట్మెంట్ రీడింగ్‌డాట్ కామ్ కొత్తగా తయారైందని చెప్పారు. ఇది అసలైన మార్కెట్ ప్రారంభానికి ముందు ఫ్రీ మార్కెట్ ట్రేడింగ్ అని, అందులో అమెరికా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ఇండియన్ సబ్సిడ్యూషన్ సంబంధించిన వివరాలు ముందుగానే తెలుస్తాయని నమ్మించారు. ఆ మరుసటి రోజు బాధితుడికి టెలిగ్రామ్ ద్వారా ఒక లింకులు పంపించి ఈ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితులు ఆప్ డౌన్లోడ్ చేసుకొని మొదట రూ.పదివేలతో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. పదివేలకు కొంత లాభం వచ్చిందంటూ సైబర్ రకాలు యాప్‌లో సూచించారు. దీంతో రూ.8.5 లక్షలతో ఐపీఓ షేర్లు కొనుగోలు చేశారు. ఆ తర్వాత రూ.42లక్షలు పే చేయాల్సి ఉందని, తర్వాత చేయాలంటూ సైబర్ నేరగాళ్లు సూచన చేశారు. ఇంతటితో యాప్ లో తనకున్న షేర్లు వేల్యూ 81.62 లక్షలు చూపించడంతో బాధితులు అది నిజమైనదిగా నమ్మాడు. తర్వాత మరో రూ.15 లక్షల వరకు వెచ్చించి మరో కంపెనీ షేర్లు కొనుగోలు చేశారు. ఇలా మొత్తం సుమారు రూ.52.60 లక్షలు పెట్టుబడి పెట్టాడు. అయితే స్క్రీన్‌పై భారీ మొత్తంలో డబ్బు కనిపించినా విత్ డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయింది. విత్ డ్రా చేసుకోవాలంటే మరింత మొత్తం చెల్లించాలంటూ షరతులు విధించడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పెండ్లికి నిరాకరించిన ప్రియుడు..యువతి ఆత్మహత్య

సుల్తానా బేగం (ఫైల్)

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 17: పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడు నివాసం ఉండే ఇంటిపై నుంచి దూకడంతో ప్రియురాలికి తీవ్ర గాయాలు కాగా హాస్పిటల్ కు తరలిస్తుండగా మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... అసోం రాష్ట్రం, కోచర్ జిల్లా, బస్కంది గ్రామానికి చెందిన సుల్తానా బేగం(26) నగరానికి వలస వచ్చి సిద్ధిఖీనగర్‌లో నివాసం ఉంటుంది. గచ్చిబౌలిలోని అంతేరా హోటల్లో వెయిటర్ గా పని చేస్తోంది. వెస్ట్ బెంగాల్ , నిదియా జిల్లా, ఉత్తర్బర అం దులా గ్రామానికి చెందిన ఫైదులా షేక్ గచ్చిబౌలిలోని నావాబ్ హోటల్లో మేనేజర్ గా పని చేస్తున్నాడు. దీంతో పాటు పార్ట్ టైమ్ జాబ్ గా పెస్ట్ కంట్రోల్ పనులు చేస్తున్నాడు. సుల్తానా, ఫైదుల్లా షేక్ లు మూడేళ్లు ప్రేమించుకుంటున్నారు. సుల్తానా తల్లిదండ్రులు సుల్తానాకు పెళ్లి చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. దీంతో సుల్తానా పెళ్లి చేసుకోవాలని ఫైదుల్లాపై ఒత్తిడి పెంచింది. బుధవారం సాయత్రం పెళ్లి విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వివిధ రకాల కారణాలు చెప్పి పెళ్లికి నిరాకరించిన ప్రియుడు ఆమె ఫోన్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాడు. దీంతో సుల్తానా మరో యువతికి ఫోన్ చేసి తన ప్రియుడు ఇంటికి వెళ్లి భవనం పై నుంచి దూకి చనిపోతానని చెప్పింది. ఆ విషయాన్ని సదరు యువకుడికి చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియురాలు సుల్తానా గురువారం ఫైదుల్లా షేర్ నివాసం ఉండే భవనంపైకి ఎక్కి ఆరో అంతస్తు నుంచి దూకడంతో పార్క్ చేసి ఉన్న బ్రీజా కారుపై పడింది. కారు ధ్వంసం కావడంతో పాటు ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హాస్పిటల్ కు తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి.. వ్యక్తి అరెస్ట్

మెహిదీపట్నం, ఏప్రిల్ 17:బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కిరాణా దుకాణ యజమానిని హుమాయున్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫస్ట్ లాన్సర్‌లోని బడా కట్టాలో ఉన్న అల్ కరీం కిరాణా దుకాణం యజమాని అబ్దుల్ రౌఫ్ (52) తన దుకాణం నుంచి ట్యూషన్‌కు వెళ్తున్న బాలిక(6)పై కొన్ని రోజుల నుంచి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. గురువారం ఆ బాలిక నొప్పి కారణంగా ఏడుస్తూ ఇంటికి వచ్చి విషయం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అబ్దుల్ రౌఫ్‌కు దేహశుద్ధి చేసి హుమాయున్ నగర్ పోలీసులకు అప్పగించారు. దీంతో అబ్దుల్ రౌఫ్‌ను అదుపులో తీసుకున్న పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

26.7 కేజీల గంజాయి పట్టివేత

రెండు కేసుల్లో ఇద్దరు అరెస్టు.. 9 మందిపై కేసు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి గంజాయి దిగుమతి చేసుకున్న ఓ వ్యక్తిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.12లక్షల విలువజేసే 25.230కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ధూల్‌పేటకు చెందిన ఆకాశ్‌సింగ్ ఒడిశా నుంచి గంజాయి దిగుమతి చేసుకుని వెళ్తుండగా.. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ బృందం ధూల్‌పేటలోని రాణి అవంతిబాయ్ విగ్రహం సమీపంలో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.13లక్షల విలువ జేసే 25.230కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ కేసుతో సంబంధం ఉన్న లఖన్ సింగ్ , సంజయ్ సింగ్ , జ్యోతి బాయ్ , ఆనంద్ సింగ్ , మణిశ్ సింగ్, దీప, నిరంజన్ కుమార్‌లపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజి రెడ్డి తెలిపారు.

మరో కేసులో...

జియాగూడ పీలా కాశీ శివ్‌మందిర్ సమీనంలో గంజాయిని అమ్మకాలు జరుపుతున్న భద్రీనారాయణ్ సింగ్‌ను ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.50వేలు విలువజేసే 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బంగ్లా వాలా అజయ్ సింగ్ , మంజు దేవిలకు సంబంధం ఉండటంతో వారిపై కూడా కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ రెండు కేసులను ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

అఘోరిపై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో జోగిని సంధ్య ఫిర్యాదు

సీఐ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న జోగిని సంధ్య

మేడ్చల్, ఏప్రిల్ 17 : అఘోరిగా చెలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న అఘోరి అలియాస్ శ్రీనివాస్ అలియాస్ శివ విష్ణు బ్రహ్మ అల్లూరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన జోగిని సంధ్య గురువారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనాథ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా జోగిని సంధ్య మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరు చెప్పుకొని ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడని, శివసత్తులు, జోగినిలు, హిజ్రా వ్యవస్థకు చెడ్డ పేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అతడు అఘోరి కాదని, అసలు హిజ్రానే కాదన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలో ఆడపిల్లలాగా ఉండి, ఒక ఆడపిల్లను పెండ్లి చేసుకొని, తాజాగా వర్షిణి అనే అమ్మాయిని పెండ్లి చేసుకొని హిజ్రాలకు మాయని మచ్చ తెచ్చాడన్నారు. దీంతో అతడి బండారం బయటపడిందని, ప్రభుత్వం, పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. నేను మొదటి నుంచి అఘోరి అలియాస్ శ్రీనివాస్ పై పోరాటం చేస్తున్నానని, కత్తులతో దాడి చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.. జోగిని సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో సైబర్ మోసం

బంజారాహిల్స్, ఏప్రిల్ 17: పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన ఇచ్చి సైబర్ మోసానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందినగర్‌లోని నౌషా బార్ అండ్ కిచెన్ రెస్టారెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న గాజుల వెంకటేశ్ ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. పార్ట్‌టైమ్ జాబ్ కావాలా అంటూ ఓ ప్రకటన కనిపించింది. ఆ ప్రకటనలోని లింక్‌ను చూడగా.. వాట్సాప్‌లో వివరాలు పంపించారు. ఆన్‌లైన్‌లో ప్రొడక్ట్స్ కొనుగోలు చేయడంతోపాటు కమీషన్ పొందవచ్చని తెలిపారు. వారి మాటలను నమ్మిన వెంకటేశ్ ఐదారుసార్లు డబ్బులు పెట్టి ప్రొడక్ట్స్ కొనుగోలు చేయడం, వాటి మీద కమీషన్ పొందడం చేశారు. కొంత నమ్మకం ఏర్పడిన తర్వాత రూ.75,900 తన ట్రేడింగ్ అకౌంట్‌లో వేయగానే సైబర్ నేరగాళ్లు వెంకటేశ్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీ కార్డు వేరే అకౌంట్‌తో లింక్ అయ్యిందంటూ..

బంజారాహిల్స్, ఏప్రిల్ 17: మీ క్రెడిట్‌కార్డు వేరే బ్యాంక్ అకౌంట్‌తో లింక్ అయ్యిందంటూ.. కాల్ చేసి సైబర్ మోసానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాలలోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని కమలాపురి కాలనీలో నివాసం ఉంటున్న సయ్యద్ అవేజ్ అహ్మద్ అనే వ్యక్తి ఓ ప్రైవేటు సంస్థలో ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డుకు కొటక్ బ్యాంక్ అకౌంట్ నంబర్‌తో లింక్ అయ్యి ఉందని, దీన్ని హెచ్‌డీఎఫ్‌సీకి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని చెప్పారు. లింక్ మార్చుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లాలని,లేకుంటే ఫోన్‌లోనే చేసుకోవచ్చంటూ ఓ లింక్ పంపించారు. ఈ లింక్‌లో వివరాలు నమోదు చేయగానే అతడి క్రెడిట్ కార్డులో నుంచి రూ.85,156 కాజేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అవేజ్ అహ్మద్ 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి లావాదేవీని బ్లాక్ చేయించారు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మార్ఫింగ్ ఫొటోలతో ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 17: మహిళా వ్యాపారవేత్తకు చెందిన ఫొటోలను మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఘటనలో నిందితులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న మహిళా వ్యాపారవేత్తకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఫొటోలు అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడంతో పాటు ఫోన్ నంబర్ పెట్టి ట్యాగ్ చేశారు. ఆమెతో పాటు మరో మహిళా ఉద్యోగి ఫొటోలను సైతం ఇదే విధంగా పోస్ట్ చేసిన విషయాన్ని గుర్తించిన బాధిత మహిళా వ్యాపారవేత్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుక్క పిల్లలను చంపిన వ్యక్తిపై కేసు

మల్కాజిగిరి, ఏప్రిల్ 17 : కుక్క పిల్లలను చంపిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధి